సాక్షి అనంతపురం

మంగళవారం । 28 । మార్చి । 2023



చీనీ టన్ను రూ.33,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.33,500 పలికాయి.



టమాట కిలో రూ.12

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.12, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.8 పలికింది.

గరిష్టం/కనిష్టం

40.2°/20.1°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత పెరిగింది. నైరుతి దిశగా గాలులు గంటకు 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.



దందాకు అడ్డే లేదు!

- బియ్యం.. రయ్‌రయ్
- కార్డుదారుల నుంచి చౌకగా కొనుగోలు
- జిల్లా సరిహద్దు నుంచి జోరుగా దందా
- కర్ణాటకలో మూడు రెట్లు అదనంగా విక్రయాలు
- అధికారులు దాడులు చేస్తున్నా ఆగని బియ్యం దందా



యాడికిలోని రైస్‌మిల్‌లో విజిలెన్స్ అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం (ఫైల్)

అనంతపురం అర్బన్: దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) పేదలకు ఆహార భద్రత కల్పించే విషయంలో జగన్ సర్కార్ ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఇదివరకటిలా ముక్కిపోయిన బియ్యం కాకుండా తినడానికి ఆమోదయోగ్యమైన బియ్యం సరఫరా చేస్తోంది. ఖర్చుకు వెనకాడకుండా నాణ్యమైన బియ్యాన్ని ప్రజా పంపిణీ వ్యవస్థ చౌకధాన్యపు దుకాణాల ద్వారా కార్డుదారులకు అందిస్తోంది. ఇంతటి నాణ్యమైన బియ్యంపై మాఫియా కన్ను పడింది. పేదల ఆర్థిక ఇబ్బందులను ఆసరా చేసుకుని.. వారి నుంచి బియ్యం కారుచౌకగా కొనుక్కుని.. పొరుగు రాష్ట్రంలో మూడు రెట్లకు అదనంగా అమ్మి సొమ్ము చేసుకుంటోంది. మాఫియాగా ఏర్పడిన వారు బియ్యం దందాను వృత్తిగా ఎంచుకున్నారు. కర్ణాటక సరిహద్దుకు ఆనుకుని ఉన్న జిల్లాలోని పలు ప్రాంతాల మీదుగా బియ్యం తరలించేస్తున్నారు. అధికారులు దాడులు చేసి.. కేసులు నమోదు చేస్తున్నా నామమాత్రపు జరిమానాలు చెల్లించి మళ్లీ దందా కొనసాగిస్తున్నారు.

కిలో రూ.10తో చౌకబియ్యం కొనుగోలు

ప్రభుత్వం పేదలకు అందిస్తున్న బియ్యంపై కిలోకు రూ.38.50 ఖర్చు చేస్తోంది. అయితే బియ్యం మాఫియాదారులు కిలో రూ.10కే ఈ బియ్యం కొంటున్నారు. ఇంటింటికీ తిరిగి బియ్యం సేకరించి 50 కిలోల సంచుల్లో ప్యాకింగ్ చేస్తున్నారు. అనంతరం బళ్లారి, బెంగళూరు, బంగారుపేట, పావగడ, చిక్‌బళ్లాపూర్ తదితర ప్రాంతాలకు గుట్టుచప్పుడుగా తరలిస్తున్నారు. ఈ బియ్యాన్ని కిలో రూ.40 దాకా విక్రయించి జేబులు నింపుకుంటున్నారు.

మూడు నెలల్లో 41 కేసులు

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌర సరఫరాల అధికారులు తరచూ దాడులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 41 కేసులు నమోదు చేశారు. 255.579 టన్నుల (2,255.79 క్వింటాళ్ల) బియ్యం స్వాధీనం చేసుకున్నారు. కిలో బియ్యానికి ప్రభుత్వం రూ.38.50 పైసలు వెచ్చిస్తోంది. ఆ లెక్కన అధికారులు స్వాధీనం చేసుకున్న ఈ బియ్యం విలువ రూ.98.40 లక్షలు అన్నమాట.

కఠిన శిక్షలు లేకనే...

రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులపై కఠిన శిక్షలు లేకపోవడం వల్లే దందా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమంగా తరలుతున్న బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై 6ఏ కేసు నమోదు చేస్తారు. ఈ కేసులను జాయింట్ కలెక్టర్ విచారణ చేసి జరిమానా విధిస్తారు. అలా కాకుండా స్టోర్ బియ్యం అక్రమంగా రవాణా చేసే వ్యక్తులకు కఠిన శిక్షలు అమలు చేస్తే కొంత వరకు కట్టడి చేసే అవకాశం ఉంటుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

జనవరి నుంచి ఇప్పటి వరకు కేసులు, స్వాధీనం చేసుకున్న బియ్యం

రెవెన్యూ డివిజన్	6ఏ కేసులు	బియ్యం క్వింటాళ్లలో
అనంతపురం	23	1,474.41
గుంతకల్లు	11	468.85
కళ్యాణదుర్గం	07	312.53
మొత్తం	41	2,255.79



❒ ఈ నెల 14న గుంతకల్లు పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ ఇంటి నంబరు 158, 159 ఆవరణలో 249.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న వాహనాన్ని విజిలెన్స్, పౌర సరఫరాల అధికారులు పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న ఐదుగురిపై 6ఏ కింద కేసు నమోదు చేశారు.



❒ రాప్తాడు మండలం హంపాపురం క్రాస్ జాతీయ రహదారి 44 వద్ద ఈ నెల 11న విజిలెన్స్, పౌర సరఫరాల అధికారులు దాడులు నిర్వహించి.. 34 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో ఉన్న వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. నలుగురు వ్యక్తులపై 6ఏ కింద కేసు నమోదు చేశారు.

క్రిమినల్ కేసు నమోదు చేస్తున్నాం



“ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాం. జిల్లా నుంచి రవాణా జరిగే మార్గంలో నిఘా పెట్టాం. విజిలెన్స్, పౌర సరఫరాల అధికారులు దాడులు నిర్వహిస్తూ అక్రమంగా రవాణా అవుతున్న బియ్యం పట్టుకుంటున్నారు. అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై 6ఏ కేసులతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు.

– శోభారాణి, పౌర సరఫరాల అధికారి

దీర్ఘకాలిక వ్యాధులకు 'సూపర్ స్పెషాలిటీ'లో చికిత్స



ఆరోగ్యశ్రీ మాన్యువల్ విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) ద్వారా 25 రకాల దీర్ఘకాలిక వ్యాధులకు ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స అందిస్తారని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. 40 ఏళ్ల వయసు దాటిన ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం విధి విధానాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు, ఆరోగ్య మిత్రలకు పంపిణీ చేయనున్న ఆరోగ్యశ్రీ మాన్యువల్‌ను, 40 ఏళ్ల వయసు దాటిన ఉద్యోగులు ఈహెచ్ఎస్ ద్వారా 25 రకాల దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స అందించే స్టిక్కర్లను జేసీ, ఇతర అధికారులు ఆవిష్కరించారు. 25 రకాల దీర్ఘకాలిక వ్యాధులకు ఈహెచ్ఎస్ ద్వారా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరక చికిత్స అందిస్తారన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉద్యోగులు ఈ అకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, డీఆర్ఓ గాయత్రిదేవి, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ రఘునందన్, డీఎంహెచ్ఓ వీరబ్బాయి, ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ కిరణ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 787 మంది గైర్హాజరు

రాప్తాడురూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో సోమవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు 787 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వీరిలో జనరల్ విద్యార్థులు 28,833 మందికి గాను 28,151 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,602 మందికి గాను 2,497 మంది హాజరయ్యారు. మొత్తం 99 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. అధికారులు వివిధ కేంద్రాలను పరిశీలించారు.

న్యూస్‌రీల్

రేపు మెడికల్ కళాశాలలో స్నాతకోత్సవం



అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ వైద్య కళాశాలలో బుధవారం సాయంత్రం ఐదు గంటలకు స్నాతకోత్సవం నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ నాగలక్ష్మి, లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ, నంద్యాల డిప్యూటీ కలెక్టర్ భరత్‌నాయక్, ఇన్‌కం ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా హాజరుకానున్నారు. 2017 బ్యాచ్‌కు చెందిన వైద్య విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనున్నారు.

చర్యలపై నివేదిక పంపండి

అనంతపురం అర్బన్: 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో గుర్తించిన సమస్యలపై తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను తక్షణం పంపించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో ఈ అంశంపై అధికారులతో ఆయన సమీక్షించారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో 34 శాఖలకు సంబంధించి 2,708 సమస్యలను గుర్తించారన్నారు. వాటిపై తీసుకున్న చర్యల గురించి నివేదికను సీపీఓకు పంపించాలని ఆదేశించారు. ప్రధానంగా గుర్తించిన సమస్యల్లో ఆర్‌డబ్ల్యూఎస్ 444, ఐసీడీఎస్ 396, డీపీఓ 383, పంచాయతీరాజ్ 341, డీఈఓ 209, డీఎంహెచ్ఓ 173, అనంతపురం మునిసిపల్ కార్పొరేషన్ 165, జెడ్పీ సీఈఓ పరిధిలో 147, పశుసంవర్ధక శాఖ 82, వ్యవసాయ శాఖ 66, ఆర్టీసీ 55 సమస్యలు ఉన్నాయన్నారు.

పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతించొద్దు



మాట్లాడుతున్న డీఈఓ సాయిరామ్

రాప్తాడురూరల్: రెగ్యులర్ పదో తరగతి పరీక్షలతో పాటు సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్) పదో తరగతి, ఇంటర్ పరీక్షలు జరుగుతాయని, ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతించొద్దని డీఈఓ సాయిరామ్ ఆదేశించారు. సోమవారం నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి జరుగుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 18 సెంటర్లను ఎంపిక చేశామని, మొత్తం 4,037 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. ప్రశ్నపత్రం లీక్ కాకుండా, మాస్ కాపీయింగ్ జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలు పూర్తయ్యేంత వరకు అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ విధులను నిబంధనల ప్రకారంగా నిర్వర్తించాలని కోరారు.

ఉచిత సీట్ల వివరాలు నోటీసు బోర్డులో ఉంచాలి

రాప్తాడురూరల్: విద్యాహక్కు చట్టం–2009 మేరకు 2023–24 విద్యా సంవత్సరంలో అన్ని ప్రైవేట్ స్కూళ్లలోనూ ఒకటో తరగతిలో పేద విద్యార్థులకు 25 శాతం కోటా సీట్ల అమలుపై ప్రతి పాఠశాలలోనూ నోటీస్ బోర్డులో ఉంచాలని డీఈఓ ఎం.సాయిరామ్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 25 శాతం రిజర్వ్ చేసిన సీట్ల వివరాలను ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 10లోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులకు సాయం కోసం డీఈఓ కార్యాలయం, ఎంఈఓ కార్యాలయాలు, గ్రామ/వార్డు సచివాలయాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశామని తెలిపారు.

సాంకేతిక ఖ్యాతి

- 'సీమ'కే తలమానికం జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాల
- నేటి నుంచి రెండు రోజులపాటు 77వ వార్షికోత్సవాలు

అనంతపురం: రాయలసీమకే తలమానికం.. ఎంతో మంది ప్రతిభావంతులను సాంకేతిక నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దిన విద్యానిలయం. అదే జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల. ఇక్కడ చదివిన ఎందరో విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. పలువురు సొంతంగా కంపెనీలు స్థాపించి వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల 77వ వార్షికోత్సవ వేడుకలు మంగళ, బుధవారాల్లో రెండు రోజులపాటు అట్టహాసంగా జరగనున్నాయి. ముఖ్య అతిథిగా వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన హాజరుకానున్నారు.

అ'పూర్వ' ఘట్టాలెన్నో...

గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థే. 1964లో బీటెక్ మొదటి సంవత్సరం అడ్మిషన్ పొందారు. టైఫాయిడ్ కారణంగా ఇంజినీరింగ్ కోర్సును మధ్యలోనే ఆపేసి నెల్లూరుకు వెళ్లిపోయారు. ఆ తర్వాత గాయకుడిగా జగద్విఖ్యాతి గాంచారు. అందుకే తన పూర్వ విద్యార్థి అయిన బాలసుబ్రహ్మణ్యంకు జేఎన్‌టీయూ(ఏ) సుమున్నతంగా సత్కరించింది. 2010లో గౌరవ డాక్టరేట్‌ను అందించింది.

- యూపీఎస్సీ మాజీ సభ్యుడు, జేఎన్‌టీయూ హైదరాబాద్ (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్) మాజీ వీసీ ప్రొఫెసర్ వై.వెంకట్రామిరెడ్డి 1968–72 బ్యాచ్‌లో బీటెక్ (ఈసీఈ) ఇక్కడే చదివారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, జేఎన్‌టీయూ హైదరాబాద్‌కు రెండు దఫాలు వీసీగా పనిచేశారు. ఏపీపీఎస్సీ చైర్మన్‌గా విధులు నిర్వర్తించి, యూపీఎస్సీ సభ్యులుగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించారు. జేఎన్‌టీయూఏ 12వ స్నాతకోత్సవంలో గౌరవ డాక్టరేట్‌ను అందించారు.
- 1980–84లో బీటెక్ (ఈసీఈ) పూర్తి చేసిన జి.సతీష్‌రెడ్డి 1986లో డీఆర్‌డీఓ (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబొరేటరీ)లో చేరారు. 2014లో డీఆర్‌డీఓ శాస్త్రవేత్తగా ఎన్నో ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టారు. 2018లో డీఆర్‌డీఓ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్, అస్త్ర, ఆకాశ్, యాంటీ–రేడియేషన్ మిస్సైల్, స్మార్ట్ ఎయిర్ ఫీల్డ్ వెపన్స్ ఆవిష్కరణల్లో కీలక పాత్ర పోషించారు.



- 1960–64లో గల్లా రామచంద్రనాయుడు బీటెక్ (ఈఈఈ) పూర్తి చేశారు. 2008లో జేఎన్‌టీయూ అనంతపురం నుంచి డాక్టరేట్ పొందారు. అమర రాజా ఫ్యాక్టరీని స్థాపించి వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు.
- జేఎన్‌టీయూ అనంతపురం ప్రస్తుత వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన ఈ కళాశాల విద్యార్థే కావడం విశేషం. 1983–87లో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో బీటెక్ పూర్తి చేసిన ఆయన 1992లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కెరీర్ ప్రారంభించారు. అనంతరం పలు హోదాల్లో పనిచేశారు. ఏపీపీఎస్సీ సభ్యులుగా పనిచేసిన ఆయన 2021 జనవరి 15న జేఎన్‌టీయూఏ వీసీగా నియమితులయ్యారు.
- జేఎన్‌టీయూ అనంతపురం రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్ ఇదే యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు.
- జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్ ఎంటెక్, పీహెచ్‌డీ ఇక్కడే పూర్తి చేశారు.
- ప్రస్తుత క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సుజాత జేఎన్‌టీయూ అనంతపురం 1989–93 మధ్య బీటెక్, తర్వాత ఎంటెక్, పీహెచ్‌డీ పూర్తి చేశారు. తాను చదివిన కళాశాలకే ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

కళాశాల ఏర్పడిందిలా..

రెండో ప్రపంచ యుద్ధం జరిగిన సమయంలో 1945లో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పడింది. మద్రాసు గిండిలో తరగతులు నిర్వహించారు. అనంతరం 1946లో అనంతపురంలో తరగతులు నిర్వహించారు. యుద్ధఖైదీలు ఉండే బ్యారక్స్‌లో తరగతులు ప్రారంభమయ్యాయి. అప్పటి మద్రాస్ ముఖ్యమంత్రి ఓ.రంగస్వామి రెడ్డియార్ జేఎన్‌టీయూ కళాశాల క్యాంపస్‌కు 300 ఎకరాలు కేటాయించారు. 1958లో కళాశాల మెయిన్ భవనాన్ని రూ.18 లక్షలతో నిర్మించారు. ఇందులో మూడు ల్యాబొరేటరీలు, ఒక వర్క్‌షాప్, బ్లాక్ అండ్ పవర్ హౌస్ ఉండేవి. 1946 నుంచి 1955 వరకు మద్రాసు వర్సిటీకి అనుబంధంగా కళాశాల కొనసాగేది. 1955–1972 వరకు ఎస్వీ యూనివర్సిటీ అనుబంధంగా ఉంది. తర్వాత జేఎన్‌టీయూ హైదరాబాద్ పరిధిలోకి వెళ్లింది.

పూర్వ జన్మ సుకృతం



నేను ఇదే కళాశాలలో బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ పూర్తిచేశాను. ప్రస్తుతం వీసీ హోదాలో విధులు నిర్వర్తిస్తుండడం పూర్వ జన్మసుకృతంగా భావిస్తున్నాను. పూర్వ విద్యార్థులు సహకారం అందిస్తుండడం ఆనందంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కళాశాలకు జాతీయస్థాయి గుర్తింపు తెచ్చేలా కృషి చేస్తున్నాం.

– ప్రొఫెసర్ జింకా రంగజనార్దన, వీసీ, జేఎన్‌టీయూ అనంతపురం

వైఎస్సార్ చలువతో యూనివర్సిటీగా..

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో జేఎన్‌టీయూ(ఏ) క్యాంపస్ కళాశాలను యూనివర్సిటీగా మార్చారు. రాయలసీమ జిల్లాలతో పాటు పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలను యూనివర్సిటీ పరిధిలోకి తెచ్చారు. రాయలసీమలో సాంకేతిక విద్యను అందించే దిశగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్సిటీ మార్పు చేయడంతో లక్షలాది మంది ఇంజినీరింగ్ విద్యార్థులు చదవడానికి ఆస్కారం ఏర్పడింది.

పూర్వ విద్యార్థుల చేయూత

తాము చదివిన ఇంజినీరింగ్ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేయూతనందిస్తున్నారు. ఉన్నత స్థానాన్ని అధిరోహించడానికి దోహదపడ్డ కళాశాలకు దన్నుగా నిలవాలనే ఉద్దేశంతో ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటిదాకా రూ.69 లక్షలను నేరుగా చెక్కుల రూపంలో విరాళాలు అందించారు. శిల్పా హాస్టల్ మరమ్మతులకు రూ.4.5 లక్షలు అందజేశారు.

ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి

- 'స్పందన'లో 363 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: 'స్పందన'లో అందే ప్రతి అర్జీకీ నాణ్యమైన పరిష్కారం చూపించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, డీఆర్ఓ గాయత్రీదేవి, ఆర్డీఓ మధుసూదన్, ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి ప్రజల నుంచి వివిధ సమస్యలపై 363 అర్జీలు స్వీకరించారు. అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో జేసీ సమీక్షించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకుని పరిష్కరించాలన్నారు.

అర్జీల్లో కొన్ని..

- సర్వే నంబరు 296/1లో 104 ప్లాట్ నంబరు తనకు కేటాయిస్తూ 2022, సెప్టెంబరు 10న తనకు ఇంటి పట్టా మంజూరైందని, అయితే తనకు ఎటువంటి నోటీసూ ఇవ్వకుండా అదే ప్లాట్‌ను ఈ ఏడాది ఫిబ్రవరి 27న వేరొక వ్యక్తికి పట్టా మంజూరు చేశారని గుంతకల్లు పట్టణం తిమ్మనచర్లకు చెందిన బి.కామేశ్వరి ఫిర్యాదు చేశారు. విచారణ చేసి తనకు న్యాయం చేయాలని కోరారు.
- అనంతపురం రూరల్ మండలం కురుగుంట సర్వే నంబర్ 320–1లో రెండు సెంట్ల చొప్పున 67 మందికి ప్రభుత్వం ఇంటిపట్టాలు ఇచ్చిందని, ఇప్పుడు ఆ స్థలాలను చదును చేసుకుంటుంటే ఒక వ్యక్తి వచ్చి స్థలం తమదంటూ అడ్డుకున్నాడని లింగమయ్య, గంగాధర్, సరస్వతి, తదితరులు 'స్పందన'లో ఫిర్యాదు చేశారు.
- తమ సొంత భూమిలో 1.76 ఎకరాలను వేరొకరి పేరున 1బీలో ఎక్కించారని అనంతపురానికి చెందిన తాళ్ల జయకృష్ణ ఫిర్యాదు చేశారు. ముప్పాల గుత్తి గ్రామ పొలంలో వివిధ సర్వే నంబర్లలో 2.67 ఎకరాల భూమిని తన తండ్రి 1982లో కొనుగోలు చేశాడని, ఇందులో 1.76 ఎకరాల భూమిని వేరొకరి పేరున 1బీలో ఎక్కించారని పేర్కొన్నారు. దీనిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం

- గాలికి విద్యుత్ తీగల రాపిడి
- అగ్గిరవ్వలు పడి బ్లాక్ కార్బన్ ముడిసరుకు దగ్ధం
- రూ.50 లక్షల నష్టం వాటిల్లిందంటున్న బాధితులు



క్రేన్‌తో బ్లాక్ కార్బన్ ముడిసరుకును పక్కకు తరలిస్తున్న దృశ్యం

తాడిపత్రి: కార్బన్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. రూ.50 లక్షల దాకా నష్టం వాటిల్లింది. పరిశ్రమ యజమాని కిరణ్‌కుమార్, సూపర్‌వైజర్ రామ్మోహన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయ్యవారిపల్లి సమీపంలోని శ్రీ ప్రసన్న ట్రేడర్స్ పరిశ్రమలో బ్లాక్ కార్బన్ ముడిసరుకు నుండి పౌడర్ తయారు చేసి, అల్ట్రాటెక్‌తో పాటు ఇతర సిమెంట్ పరిశ్రమలకు సరఫరా చేస్తుంటారు. పరిశ్రమలో ఓ చోట నిల్వ ఉంచిన ముడి సరుకు మీదుగా వెళ్లిన విద్యుత్ తీగలు సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో గాలికి ఒకదానికొకటి తగులుకున్నాయి. ఈ క్రమంలో తీగల నుంచి నిప్పురవ్వలు ఎగిసి బ్లాక్ కార్బన్ ముడిసరుకుపై పడటంతో మంటలు వ్యాపించాయి. నిమిషాల వ్యవధిలోనే అగ్నికీలలు ఎగసిపడటంతో సమీపంలోని అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమకు చెందిన ఫైరింజన్‌తో పాటు తాడిపత్రి నుంచి ఫైర్ ఎస్ఐ మోహన్‌బాబు, అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌తో ప్రమాదస్థలికి చేరుకున్నారు. దాదాపు ఐదు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే..

బ్లాక్ కార్బన్ ముడి సరుకును వివిధ రాష్ట్రాల నుంచి తెప్పించి, ఇక్కడ ముడి సరుకును చిన్నచిన్న ముక్కలుగా ప్రాసెస్ చేసి, సిమెంట్ పరిశ్రమల్లో వాడే బొగ్గుతో కలిపి వీటిని మండించేందుకు వాడతారు. అయితే ట్రేడర్స్ పరిధి స్థలంలో ఉన్న విద్యుత్ తీగలు సరిగా లేవని విద్యుత్ అధికారులకు తెలిపాం. వారు మరమ్మతులు చేసి ఉంటే అగ్ని ప్రమాదం జరిగేది కాదు. రూ.50 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించింది.

– కిరణ్ కుమార్, యజమాని, శ్రీ ప్రసన్న ట్రేడర్స్

మాదక ద్రవ్యాల విక్రేతలపై ఉక్కుపాదం




మాట్లాడుతున్న డీఐజీ రవిప్రకాష్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: మాదకద్రవ్యాల విక్రేతలపై ఉక్కుపాదం మోపాలని అనంతపురం రేంజ్ డీఐజీ ఎం.రవిప్రకాష్ ఆదేశించారు. సోమవారం అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాల పోలీసు అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. డ్రగ్స్ కేసులపై సమీక్షించారు. ప్రధానంగా మాదకద్రవ్యాల (డ్రగ్స్)తయారీ, సరఫరా, విక్రయం, కొనుగోలుతో సంబంధమున్న ప్రతి ఒక్కరిపైనా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమర్షియల్ క్వాంటిటీ కేసుల్లో (20 కిలోల కంటే ఎక్కువ మోతాదులో ఉన్న గంజాయి) లోకల్ పెడ్లర్స్‌ను గుర్తించాలన్నారు. వీరికున్న కీలక నిందితులను లింకు చేయాలని, గంజాయి వినియోగించే వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. మూడు, అంతకంటే ఎక్కువ కేసుల్లో నిందితులుగా ఉంటే అలాంటి వారిపై పీడీ యాక్టు నమోదు చేయాలన్నారు. ముఖ్య పట్టణాలలో గంజాయి, తదితర మత్తు పదార్థాల అనర్థాలను వివరించే హోర్డింగులు ఏర్పాటు చేయాలన్నారు. కళాశాలలకు వెళ్లి మత్తు పదార్థాలు, అనర్థాలపై కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా పెట్టి.. మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి చేయాలని సూచించాలన్నారు. ఈ కేసుల ఛేదింపునకు బాగా పని చేసిన వారికి రివార్డులు అందజేస్తామని ప్రకటించారు. చెక్ పోస్టులు, ప్రత్యేక దాడులు నిర్వహించి కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో ఎస్పీలు డాక్టర్ ఫక్కీరప్ప, రాహుల్ దేవ్‌సింగ్, రిషాంత్‌రెడ్డి, రేంజ్ పరిధిలో నాలుగు జిల్లాల అదనపు ఎస్పీలు, శ్రీసత్యసాయి, తిరుపతి జిల్లాల ఎస్డీపీఓలు, నాలుగు జిల్లాల డీసీఆర్బీ సీఐలు, తిరుపతి, చిత్తూరు జిల్లాల సెబ్ అధికారులు పాల్గొన్నారు.

దాహార్తి ఎరుగని అనంత

- మూడేళ్లుగా కనిపించని కరువు ఛాయలు
- సమృద్ధిగా కురిసిన వర్షాలు
- ప్రాజెక్టులు, కుంటలు, చెరువులకు జలకళ
- మండు వేసవిలోనూ చెరువుల్లో తగ్గని నీటి మట్టం
- భూగర్భజలాల అభివృద్ధితో సాగు, తాగునీటి ఇక్కట్లు దూరం



కంబదూరు చెరువు కింద సాగైన వరి పంట

అనంతపురం సెంట్రల్: రాయలచెరువు, వైటీ చెరువు, పాతకొత్త చెరువు, నాగసముద్రం, చోళసముద్రం.. ఊర్ల పేర్లలో సముద్రాలు, చెరువులకు కొదవలేకపోయినా.. అక్కడ నీళ్ల పారేది మాత్రం మనుషుల కళ్లలోనే! పాతిక ఎకరాలున్న రైతైనా.. వానలు కురవకపోతే ఇల్లూ నేలా వదిలి వలస పోవాల్సిందే. అక్షర క్రమంలో మొదటిదిగా ఉన్న అనంతపురం జిల్లా దైన్య పరిస్థితి ఇది. ఈ మూడేళ్లలో సమృద్ధిగా కురిసిన వర్షాలతో ఇక్కడి పరిస్థితుల్లో సమూల మార్పులు చోటు చేసుకున్నాయి. దుర్భిక్షానికి మారుపేరైన అనంత జిల్లాలో కరువు ఛాయలు పూర్తిగా మటుమాయమయ్యాయి.

సీజన్ ఏదైనా తాగునీటికి కటకటే!

అనంతపురం జిల్లా అంటే ఠక్కున గుర్తొచ్చేది కరువు... కాటకాలు! ఒకప్పుడు సీజన్ ఏదైనా ఇక్కడ గుక్కెడు నీటికి కటకటలాడాలే దైన్య పరిస్థితులు ఉండేవి. వందలాది గ్రామాలకు, పట్టణాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తే ప్రజావసరాలకు అరకొరగానే సరిపోయేవి. ఇంతటి దుర్భర పరిస్థితులు 2019 తర్వాత క్రమంగా కనుమరుగవుతూ వచ్చాయి. సమృద్ధిగా కురిసిన వర్షాలకు తోడు హెచ్చెల్సీ, హంద్రీ-నీవా ప్రాజెక్టుల ద్వారా జిల్లాలోని చెరువులు, ప్రాజెక్టులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. చివరకు మండు వేసవిలోనూ చెరువుల్లో నీటి మట్టం తగ్గడం లేదు. ఫలితంగా భూగర్భజలాలు గణనీయంగా పెరిగి వ్యవసాయం పండుగలా సాగుతోంది. తాగునీటి సమస్య అనేది ఎక్కడేగాని ఉత్పన్నం కావడం లేదు.

242 చెరువుల్లో పుష్కలంగా నీరు

జిల్లా వ్యాప్తంగా 301 చెరువులుండగా గత ఖరీఫ్‌లో విస్తారంగా వర్షాలు కురవడంతో దాదాపు అన్ని చెరువులూ జలకళను సంతరించుకున్నాయి. 242 చెరువుల్లో నేటికీ పుష్కలంగా నీళ్లున్నాయి. ఎండలు తీవ్ర ప్రభావం చూపే మార్చిలో సైతం చెరువుల్లో నీటి మట్టం తగ్గుముఖం పట్టలేదు. ఫలితంగా ఎన్నడూ లేని విధంగా చెరువుల కింద 35వేల ఎకరాల్లో పంటలు సాగులోకి వచ్చాయి.

జిల్లాలో మొత్తం చెరువులు	301
మొత్తం నీటి నిల్వ సామర్థ్యం	7,086 ఎంసీఎఫ్‌టీ
నేటికీ నీటితో తొణికిసలాడుతున్న చెరువులు	242
చెరువుల్లో ఉన్న నీటి నిల్వ	5,703 ఎంసీఎఫ్‌టీ
నూరు శాతం నీరున్న చెరువులు	75
75శాతం నీరున్న చెరువులు	96
50శాతం నీరున్న చెరువులు	46
25 శాతం నీరున్న చెరువులు	25



2018లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని పట్టుకుంటున్న గోపరాజుపల్లి వాసులు (ఫైల్)

వాటర్ ట్యాంక్ ద్వారా తాగునీటిని పట్టుకుంటున్నారంటే పరిస్థితి తీవ్రత ఏమిటో అర్థం చేసుకోవచ్చు. 2018 వరకూ పుట్లూరు మండలం గోపరాజుపల్లి వాసులు ఈ పరిస్థితిని ఎదుర్కొన్నారు. వేసవిలోనే కాదు... ఇతర సీజన్లలోనూ ఇక్కడి వారికి ట్యాంకర్ల నీరే దిక్కు. 2019 తర్వాత వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో ఈ మూడేళ్లలో పరిస్థితుల్లో సమూలంగా మార్పు చోటు చేసుకుంది. చెరువులు, కుంటలు, ప్రాజెక్ట్‌లు జలకళను సంతరించుకోవడంతో భూగర్భ జలాలు పెరిగి ప్రజల తాగునీటి కష్టాలు దూరమయ్యాయి. ప్రస్తుతం జలజీవన్ మిషన్ కార్యక్రమం కింద ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తున్నారు.



పుష్కలంగా నీళ్లున్న కంబదూరు చెరువు

కంబదూరు చెరువు.. జిల్లాలోనే అతి పెద్ద చెరువుల్లో ఒక్కటిగా ఖ్యాతిగాంచిన ఈ చెరువు నీటి నిల్వ సామర్థ్యం 0.201 టీఎంసీలు. ఈ చెరువు కింద 1,100 ఎకరాల ఆయకట్టు ఉంది. అనధికారికంగా అదే స్థాయిలో భూముల్లో పంటలు సాగవుతుంటాయి. 1997 వరకు ఈ చెరువులో నీరుండేది. ఆ తర్వాత చుక్కనీరు లేక బోసిపోయింది. ఈ మూడేళ్లలో కురుస్తున్న వర్షాలకు కంబదూరు చెరువు మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. పాతికేళ్ల తర్వాత ఈ ఏడాది చెరువు మరువ పారింది. మండు వేసవిలోనూ చెరువులో నీటి మట్టం తగ్గకుండా ఉండడంతో చుట్టుపక్కల గ్రామాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. దీంతో పంటల సాగు విస్తీర్ణం కూడా పెరిగింది.

భూగర్భజలాలు అభివృద్ధి చెందాయి

జిల్లాలో ఈ ఏడాది అన్ని చెరువులకు నీళ్లు చేరాయి. వర్షాలకు తోడు హంద్రీ-నీవా ప్రాజెక్టు ద్వారా చెరువులను నీటితో నింపాం. దీంతో భూగర్భజలాలు బాగా అభివృద్ధి చెందాయి. వేసవిలోనూ తాగునీటి ఇబ్బందులు తలెత్తడం లేదు.

– శ్రీనివాసరెడ్డి, సీఈ, జలవనరులశాఖ

ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

- అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



104 వాహనాలను ప్రారంభిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

అనంతపురం అర్బన్: ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని అసిస్టెంట్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. జిల్లాకు కొత్తగా మంజూరైన ఆరు 104 వాహనాలను సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ప్రజలకు సత్వర వైద్యం అందించేందుకు జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే మండలానికి ఓ 104 వాహనాన్ని ఇప్పటికే ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. తాజాగా మరో ఆరు వాహనాలను సమకూర్చినట్లు వివరించారు. వీటిని మొబైల్ మెడికల్ చెకింగ్‌కు వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి, ఆర్యోశ్రీ కో-ఆర్డినేటర్ కిరణ్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి యుగంధర్, డీసీహెచ్‌ఎస్ కృష్ణవేణి, మలేరియా అధికారి ఓబులు, వైద్యాధికారులు అనుపమ, సుజాత, వీరారెడ్డి, నారాయణ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఇరు వర్గాల ఘర్షణ

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడులో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుని నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామంలోని ఎస్సీ కాలనీలో చిన్నపాటి విషయంపై ఆదివారం అర్ధరాత్రి ఇరు వర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. కర్రలు, కొడవళ్లతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఘటనలో ఈశ్వరయ్య, నాగరాజు, సంజప్ప, మరో వర్గంలోని సుధాకర్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

షీప్ యూనియన్ త్రీమెన్ కమిటీ అధ్యక్షుడిగా నరసింహగౌడ్



డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం సమక్షంలో బాధ్యతలు తీసుకుంటున్న పసుపుల నరసింహగౌడ్

అనంతపురం అగ్రికల్చర్: గొర్రెలు, మేకల పెంపకందారుల ప్రాథమిక సహకార సంఘాల జిల్లా సమాఖ్య (షీప్ అండ్ గోట్ యూనియన్)కు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన త్రీమెన్ కమిటీ పాలకవర్గం సభ్యులు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. పర్సన్ ఇన్‌చార్జిగా ఉన్న పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం సమక్షంలో అధ్యక్షుడిగా రాప్తాడు మండలానికి చెందిన పసుపుల నరసింహగౌడ్, సభ్యులుగా పి.ఈశ్వరయ్య, బి.కిష్టప్ప బాధ్యతలు స్వీకరించారు. గొర్రెల సహకార సంఘాలకు ఎన్నికలు జరిగే దాకా... లేదంటే గరిష్టంగా రెండేళ్ల పాటు త్రీమెన్ కమిటీకి అధికారాలు ఉంటాయని డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులకు ఈ సందర్భంగా నరసింహగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. కాగా, మంగళవారం జిల్లా యూనియన్ సమావేశం ఉంటుందని పర్సన్ ఇన్‌చార్జ్ డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ గోల్డ్‌స్మన్ తెలిపారు.

ఫార్మా-డీ ఫస్టియర్ సప్లి ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఫిబ్రవరి, మార్చిలో నిర్వహించిన ఫార్మా-డీ మొదటి సంవత్సరం (ఆర్-17) అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఇ.కేశవరెడ్డి తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం జేఎన్‌టీయూ అనంతపురం వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చన్నారు.

క్లుప్తంగా

గూగూడులో హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

నార్పల: గూగూడు కుళ్లాయిస్వామి హుండీ కానుకల లెక్కింపును సోమవారం చేపట్టారు. రూ.16,95,130 ఆదాయం సమకూరినట్లు దేవదాయ శాఖ ఈఓ శోభ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ శివశంకర్‌రెడ్డి, సర్పంచ్ రమణకుమారి, ఎంపీటీసీ సభ్యుడు రాజారెడ్డి, కో-ఆప్షన్ సభ్యురాలు షాబీరా, గ్రామస్తులు లింగారెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

30 నుంచి మోటార్ రీవైండింగ్‌పై ఉచిత శిక్షణ

అనంతపురం: రూడ్‌సెట్ సంస్థలో ఈ నెల 30 నుంచి మోటార్ రీవైండింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆ సంస్థ డైరెక్టర్ లోక్‌నాథరెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నెల రోజుల శిక్షణా కార్యక్రమంలో ఉచిత వసతితో పాటు భోజన సదుపాయాలు కల్పిస్తారు. ఆసక్తి ఉన్న ఉమ్మడి జిల్లాకు చెందిన యువకులు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు 96188 76060, 94925 83484లో సంప్రదించవచ్చు.

రహదారిపై గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం



వృద్ధుడి మృతదేహం

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట శివారులో 44వ జాతీయ రహదారిపై సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. బైపాస్ రోడ్డు డివైడర్‌పై పడి ఉన్న మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతుడు తెల్ల అంగీ, నలుపు రంగ ప్యాంట్ ధరించాడు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని ఎస్‌ఐ శ్రీనివాసులు కోరారు.

అధైర్యపడకండి అండగా ఉంటాం

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



రమాదేవి కుటుంబానికి పట్టా అందిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి, పైలా నరసింహయ్య

నార్పల: బుక్కరాయసముద్రం చెరువులో హత్యకు గురైన దళిత రమాదేవి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని స్థానిక ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య భరోసానిచ్చారు. సోమవారం వారు బొందలవాడలోని రమాదేవి కుటుంబసభ్యులను పరామర్శించారు. రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఐదు సెంట్ల ఇంటి స్థలంతో పాటు, నిత్యావసర సరుకులూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రమాదేవి హత్య బాధాకరమన్నారు. హంతకుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఐదు ఎకరాల పొలంతో పాటు రూ.8.25 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమి చైర్‌పర్సన్ హరిత, ఎంపీపీ నాగేశ్వరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, జెడ్పీ వైస్ చైర్మన్ నాగరత్నమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, మిద్దె కుళ్లాయప్ప, రంగయ్య, అద్దాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే శరణ్యం

- జెడ్‌బీఎన్‌ఎఫ్ డీపీఎం లక్ష్మానాయక్



మాట్లాడుతున్న డీపీఎం లక్ష్మానాయక్

అనంతపురం అగ్రికల్చర్: ప్రజారోగ్యం, పర్యావరణం, రైతుల బాగోగుల దృష్ట్యా భవిష్యత్తులో ప్రకృతి వ్యవసాయమే శరణ్యం కానుందని జీరో బేస్ట్ నాచురల్ ఫార్మింగ్ (జెడ్‌బీఎన్‌ఎఫ్) డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) లక్ష్మానాయక్ అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై స్థానిక ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో అనంతపురం, కర్నూలు, నంద్యాల, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి వచ్చిన మోడల్ మేకర్స్‌కు సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మానాయక్ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున విస్తరించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఈ తరహా వ్యవసాయంలో ప్రావీణ్యమున్న రైతులను గుర్తించి మోడల్ మేకర్స్‌గా సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత వీరి ద్వారా మిగిలిన రైతులకు అవగాహన కల్పించి ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు ఏపీ ప్రభుత్వానికి చెందిన రైతు సాధికార సంస్థ (ఆర్‌వైఎస్ఎస్), ఏపీ కమ్యూనిటీ మేనేజ్ నాచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) తోడ్పాటును అందిస్తున్నాయన్నారు. మోతాదుకు మించి రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం వల్ల ఆహారోత్పత్తులు విషతుల్యమై ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయన్నారు. అలాగే వీటి వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు భారీగా పెరగడం వల్ల నష్టాలు చవిచూడాల్సి వస్తోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు ప్రకృతి సాగు విధానాలు అవలంబిస్తే వ్యవసాయం లాభసాటిగా మారుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ ప్రవీణ్, ఎస్‌ఆర్‌పీ నరేంద్ర, జిల్లా కో ఆర్డినేటర్ భానుమతి, 55 మంది మోడల్ మేకర్స్ పాల్గొన్నారు.

జెడ్పీలో 32 మందికి స్థానచలనం

పని తీరు ప్రామాణికంగా సీట్ల కేటాయింపు



అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులకు స్థానచలనం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పని తీరు వివాదస్పదంగా ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని మరో సెక్షన్‌కు బదిలీ చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు సీఈఓ భాస్కరరెడ్డి, డిప్యూటీ సీఈఓ జల్లా శ్రీనివాసులు, అకౌంట్స్ ఆఫీసర్ అమృతరాజ్ నివేదించిన నివేదికకు జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ ఆమోద ముద్ర వేశారు. మొత్తం 32 మందికి సెక్షన్లు మారుస్తూ ఉత్వరులు జారీ చేశారు. ఉత్తర్వులు అందుకున్న వారిలో పరిపాలనాధికారులతో పాటు సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, నాల్గో తరగతి ఉద్యోగులూ ఉన్నారు. కాగా, సాధారణ బదిలీల అనంతరం ఇతర ప్రాంతాల నుంచి చాలా మంది ఉద్యోగులు బదిలీపై జెడ్పీకి వచ్చారు. అయితే కొందరు ఉద్యోగుల పనితీరు సక్రమంగా లేకపోవడంతో వారిపై చైర్‌పర్సన్ గిరిజమ్మతో పాటు ముఖ్య అధికారులు అసంతృప్తితో ఉండేవారు. ప్రస్తుతం పనితీరు ఆధారంగా సెక్షన్లు మార్పు, సీట్ల కేటాయింపు చేయడంతో త్వరలో అన్ని సెక్షన్ల ఉద్యోగులతో జెడ్పీ చైర్‌పర్సన్ సమావేశం కానున్నట్లు తెలిసింది.

బదిలీ అయిన వారు వీరే..

ఉద్యోగి	హోదా	ప్రస్తుత చోటు	బదిలీ స్థానం
బీఎస్ శ్రీనివాసులు	ఏఓ	కె-సెక్షన్	జి-సెక్షన్
వి.ధనుంజయనాథ్	ఏఓ	ఐ-సెక్షన్	ఎల్, కె-సెక్షన్
జీఏ రవిప్రసాద్	ఏఓ	ఎల్-సెక్షన్	ఐ-సెక్షన్
బి.రాఘువేంద్రుడు	ఎస్‌ఏ	జి-5, జి-7	ఎ-2
ఫణిశేఖర్‌రెడ్డి	ఎస్‌ఏ	బి-సెక్షన్	ఎల్-2, ఎల్-3
భానురేఖ	ఎస్‌ఏ	ఎఫ్-1	జి-6, జి-9
బి.శారద	ఎస్‌ఏ	ఎఫ్-1	జి-6, 9
నరసింహమూర్తి	ఎస్‌ఏ	డి-2	డి-2
కె.అరుణ కుమారి	ఎస్‌ఏ	డి-1	డి-1
పి.పద్మావతి	ఎస్‌ఏ	హెచ్-2	హెచ్-2
మహేష్	ఎస్‌ఏ	డి-5	డి-5
మేషియా	ఎస్‌ఏ	జి-1, జి-2	జి-2
రక్షిత	జేఏ	డి-6	డి-6
మర్తాడు షేక్ రఫీ	జేఏ	ఎ-4	ఎ-4
కేశవ	జేఏ	జి-4	జి-4
పి.రఘురాం	జేఏ	ఎ-4	జి-1, 5, 7
బి.సుశీలాదేవి	జేఏ	హెచ్-2	ఎఫ్-5
ఎం.పద్మావతి	జేఏ	ఎఫ్-5	బి-సెక్షన్
ఎం.రవికుమార్	టైపిస్ట్	ఎ-సెక్షన్	పీఎఫ్-కంప్యూటరైజేషన్
ఎం.నాగశిరీష	టైపిస్ట్	పీఎఫ్-కంప్యూటరైజేషన్	ఎ-సెక్షన్

సమస్యలకు చట్ట పరిధిలో పరిష్కారం చూపండి : ఎస్పీ



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: చట్టపరిధిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 141 వినతులు అందాయి. ఎస్పీ స్వయంగా అర్జీలు స్వీకరించి, సమస్య తీవ్రతపై బాధితులతో ఆరా తీశారు. అనంతరం సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కాగా, తనకు భర్త నుంచి ప్రాణహాని ఉందంటూ గుత్తి ఆర్‌ఎస్‌కు చెందిన అంజూమ్... ఎస్పీ ఫక్కీరప్పకు ఫిర్యాదు చేసింది. కొద్ది రోజుల క్రితం గుత్తి ఆర్‌ఎస్‌లోని రియాజ్ బాషాతో వివాహమైందని, కట్న కానుకల కింద రూ.25 లక్షల విలువైన బంగారాన్ని అందజేశారని గుర్తు చేసింది. అదనపు కట్నం కోసం భర్త వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో పుట్టింటికి చేరుకున్నట్లు తెలిపింది. ఘటనకు సంబంధించి గుత్తి పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు పట్టించుకోవడం లేదని వాపోయింది. స్పందించిన ఎస్పీ వెంటనే గుత్తి పోలీసులతో ఫోన్‌లో మాట్లాడారు. బాధిత యువతి ఫిర్యాదును స్వీకరించి కేసు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేంద్రుడు పాల్గొన్నారు.

30న జిల్లా స్థాయి వృషభాల బలప్రదర్శన

రాప్తాడు: శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఈ నెల 30న రాప్తాడులో జిల్లా స్థాయి వృషభాల బలప్రదర్శన (రాతి దూలం లాగుడు పోటీలు) ఉంటుందని లక్ష్మీపండమేటి రాయుడు ఆలయ పాలకమండలి సభ్యులు తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీల్లో విజేతలైన వృషభాల యజమానులకు నగదు పురస్కారాలతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 81069 46853, 94400 88531, 91003 15617లో సంప్రదించాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు గంజి రాముడు కోరారు.

ఆ ప్రశ్నకు రెండు మార్కులు

రాప్తాడురూరల్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సోమవారం జరిగిన ఫిజిక్స్(ఇం.మీ) పరీక్షకు సంబంధించి మూడో ప్రశ్న గందరగోళంగా ఉన్నందున.. సమాధానం రాసినా, రాయకపోయినా రెండు మార్కులు కలపనున్నట్లు ఇంటర్ బోర్డు ప్రకటించిందని ఆర్‌ఐఓ సురేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. దీనిపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందొద్దని పేర్కొన్నారు.

క్లుప్తంగా

పుస్తకాలు అందుబాటులో ఉంచాలి


రికార్డులను పరిశీలిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమామోహన్‌రెడ్డి

ఆత్మకూరు: గ్రంథాలయంలో పాఠకులు చదివే అన్ని పుస్తకాలు అందుబాటులో ఉండేలా చేయాలని గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమా మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించారు. రోజుకు ఎంత మంది గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్నారో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల గ్రంథాలయ అధికారి నల్లమ్మ పాల్గొన్నారు.

నేడు శివబాలయోగీశ్వరుల ఆరాధనోత్సవం

అనంతపురం కల్చరల్: నగరంలోని ప్రఖ్యాత ఆధ్యాత్మికవేత్త శ్రీ శివబాలయోగీశ్వరుల 29వ ఆరాధన వేడుకలు మంగళవారం జరుగునున్నాయి. వివరాలను నిర్వాహకులు గుప్తా, రత్నగిరి దేవరాజ్ తెలియజేశారు. స్వామీజీ శివైక్యమైన రోజుగా ఆశ్రమంలో స్వామివారి విగ్రహానికి విశేష అభిషేకాలు, అలంకార సేవలు, సామూహిక భజన, స్వామి జీవిత విశేషాలు తెలిపే కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

ఘట్టమరాజుకు అరుదైన పురస్కారం

అనంతపురం కల్చరల్: జిల్లాకు చెందిన సుప్రసిద్ధ భాషావేత్త, విమర్శకుడు ఘట్టమరాజు అశ్వత్థనారాయణకు మరో అరుదైన గౌరవం దక్కింది. తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకంగా అందించే కీర్తి పురస్కారానికి ఆయన్ను ఎంపిక చేశారు. ఆయన గత నాలుగు దశాబ్దాలుగా తెలుగు విమర్శనా రంగంలో నిర్విరామ కృషి చేస్తున్న ఆయన 'ఆలిచిప్పలు- ఆణిముత్యాలు' అనే జానపద గేయాల సంకలనం, 'అనంతరాగం' పేరిట రాళ్లపల్లి వారి పీఠికలు, వ్యాసాలను గ్రంథాలుగా తెచ్చారు. ఈనెల 28న పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఆయన ప్రసిద్ధ సాహితీవేత్తలు, ప్రముఖుల చేతుల మీదుగా పురస్కారం అందుకోనున్నారు. జిల్లా వాసి పురస్కారానికి ఎంపిక కావడం హర్షణీయమని సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్‌నారాయణ అభినందనలు తెలియజేశారు.

కమనీయం..కల్యాణోత్సవం


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర, శ్రీవల్లి,దేవసేన ఉత్సవ విగ్రహాలు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం సోమవారం కమనీయంగా నిర్వహించారు. చైత్రమాస శుద్ధ షష్టి సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీవల్లి, దేవసేన ఉత్సవ విగ్రహాలకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి, పసుపు, కుంకుమ కలిపిన అక్షింతలతో వేదపడింతుల మంత్రోచ్చారణలతో కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

కొనసాగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాలు

పామిడి: మండలంలోని ఎద్దులపల్లిలో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న వసంత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం శ్రీకృష్ణుని విగ్రహాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని శక్తి దేవాలయాల్లో వెలసిన అమ్మవార్లకు ఒడి బియ్యం సమర్పించి, భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం గ్రామవీధుల్లో శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని భక్తిగీతాల మధ్య ఊరేగించారు. శ్రీరామనవమి పండుగతో ఈ ఉత్సవాలు ముగుస్తాయని గ్రామస్తులు తెలిపారు.

ఖైదీలకు వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రమణనాయక్

శింగనమల: బుక్కరాయసముద్రం మండలంలోని ఓపెన్ ఎయిర్ జైలు ఖైదీలకు వైద్య పరీక్షలను నిర్వహించినట్లు శింగనమల సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ నాయక్ తెలిపారు. జైలు సూపరింటెండెంట్ చిన్నారావు ఆదేశాలతో సోమవారం జైలులోని 31 మంది ఖైదీలకు వైద్య పరీక్షలు చేశామన్నారు. అనంతరం ఖైదీలకు ఆరోగ్య సూచనలిచ్చారు. కార్యక్రమంలో జైలు సీఐ శివశంకర్, ఫార్మాసిస్ట్ పవన్, ఎంఎస్‌ఓ నాగేంద్ర పాల్గొన్నారు.

నగర రూపురేఖలు మార్చాం

- టీడీపీ హయాంలో అభివృద్ధి శూన్యం
- ప్రస్తుతం రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు
- కౌన్సిల్ సమావేశంలో మేయర్ వసీం


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ వసీం


నగర పాలక కౌన్సిల్ సమావేశానికి హాజరైన డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు

అనంతపురం క్రైం: టీడీపీ హయాంలో వర్గపోరుతో అభివృద్ధి మాటలకే పరిమితమైంది.. తమ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రెండేళ్లలోనే నగర రూపురేఖలు మార్చామని, రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు మేయర్ వసీం పేర్కొన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ వసీం అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అజెండాలోని 26 అంశాలకు సంబంధించి రూ.35 కోట్ల అభివృద్ధి పనులకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. మేయర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో నగరంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. రూ.312 కోట్లతో చేపట్టిన జాతీయ రహదారి విస్తరణ, టవర్‌క్లాక్ వద్ద ఓవర్ బ్రిడ్జ్ పనులు తుది దశకు వచ్చాయన్నారు. ఎన్‌టీఆర్ మార్గ్‌కు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. జేఎన్‌టీయూఏ, శ్రీకంఠం సర్కిల్ నుంచి గుత్తి రోడ్డు, గుత్తి రోడ్డు కనకదాస విగ్రహం నుంచి తడకలేరు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి రోడ్డు, విద్యుత్‌నగర్ నుంచి నవోదయ కాలనీకి వెళ్లే రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. అర్బన్‌హెల్త్ సెంటర్లు, నగర ప్రజలకు శుద్ధి జలం అందించేందుకు ముద్దలాపురం ఫిల్ట్రేషన్ పాయింట్‌లో రూ.65 లక్షలతో ఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా 74 సచివాలయాల పరిధిలో రూ.14.80 కోట్లు, స్పెషల్ గ్రాంట్ కింద మంజూరైన రూ.25 కోట్లతో అన్ని డివిజన్లలోనూ అంతర్గత రోడ్లు, కాలువలు, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రానున్న రోజుల్లోనూ ప్రతి డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమం అందిస్తామని మేయర్ హామీ ఇచ్చారు.

సెంట్రల్ పార్క్ స్థలంపై రచ్చ

సమావేశం ప్రారంభంలోనే సెంట్రల్ పార్క్ స్థలం 6.5 ఎకరాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ బండి నాగమణి మేయర్ పోడియం వద్ద బైఠాయించగా, ఆమెకు మద్దతుగా బాబాఫకృద్దీన్, కోఆప్షన్ సభ్యురాలు ఉమామహేశ్వరి కూర్చున్నారు. గత కౌన్సిల్ సమావేశంలో స్థలాన్ని సర్వే చేసి, రక్షణ గోడలను ఏర్పాటు చేయాలని చెప్పినా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోలేదన్నారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు లీలావతి, లావణ్య, బాలాంజనేయులు, బాబాఫకృద్దీన్, అబూసలేహా, కోఆప్షన్ సభ్యులు మద్దతు తెలిపారు. అనంతరం పోడియం వద్ద నిరసన తెలుపుతన్న బండి నాగమణి వద్దకు మేయర్ వచ్చి సర్దిచెప్పారు.

పార్కు స్థల సర్వే నివేదిక ఇవ్వండి

అక్కడ సెంటు స్థలం రూ.20 లక్షల ధర ఉందని, ఈ లెక్కన రూ.వందల కోట్ల విలువజేసే పార్కు స్థలాన్ని గతంలోనే ఏసీపీ షబ్నమ్‌శాస్త్రి సర్వే చేశారని, ఆనివేదికను చూపాలని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, కార్పొరేటర్ సైఫుల్లాబేగ్ పట్టుపట్టగా, ఏసీసీ శ్రీనివాసులు నుంచి స్పందన లేదు. టౌన్‌ప్లానింగ్ విభాగం నిర్లక్ష్యంతోనే నగరంలో అక్రమ నిర్మాణాలు వెలిశాయని, ఐదు భవనాలకు సంబంధించి చార్జ్‌షీట్ దాఖలు చేయడంలో విఫలమయ్యారని డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు సైఫుల్లా బేగ్, శ్రీనివాసులు, అబూసలేహా, లీలావతి, లావణ్య నిలదీశారు. సాయినగర్‌లోని సరస్వతి విద్యామందిరం స్థలం లీజుకిచ్చారా? లేక వారికే అప్పగించారా అని కార్పొరేటర్ సైఫుల్లాబేగ్ ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికులకు సౌకర్యాలు కల్పించాలని పాలకవర్గం సభ్యులు కమిషనర్ రమణారెడ్డిని కోరారు. తాగునీటి పైప్‌లైన్ మార్చిన తర్వాత రోడ్డు పనులు చేయాలని డిప్యూటీ మేయర్ కోగటం ఎస్‌హెచ్ ఏఈఈ ధనలక్ష్మిని కోరారు. తన డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించిందని కార్పొరేటర్ టీవీ చంద్రమోహన్ రెడ్డి ఆరోపించారు. టౌన్ ప్లానింగ్ అధికారుల అక్రమాలపై దాదాపుగా రెండు గంటల పాటు చర్చ జరిగింది. ఈ కౌన్సిల్ సమావేశంలో పాలకవర్గ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫొటో ఎగ్జిబిషన్

వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత రెండేళ్లలో నగరపాలక సంస్థలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. సోమవారం నగరపాలక సంస్థ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను మేయర్ ప్రారంభించారు. ప్రతి డివిజన్‌లో నాడు-నేడుగా చేపట్టిన రోడ్లు, కాలువలు, పార్కులభివృద్ధి తదితర వాటిని ఆధారాలతో ప్రదర్శనలో ఉంచారు.


నాడు-నేడు ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు

నేటి నుంచి 'వైఎస్సార్ ఆసరా' వారోత్సవాలు

అనంతపురం క్రైం: నగరంలోని వివిధ డివిజన్లలో మంగళవారం నుంచి వచ్చే నెల 2 వరకు వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. స్వయం సహాయక సభ్యులు ఈ కార్యక్రమాలకు హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీంలు ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. 28న గుత్తి రోడ్డులోని విద్యుత్ కళాభారతిలో జరగనున్న కార్యక్రమంలో 1వ సచివాలయం నుంచి 15 సచివాలయ పరిధిలోని లబ్ధిదారులు హాజరుకావాలన్నారు. 29న విద్యుత్ కళాభారతిలో జరిగే కార్యక్రమంలో 1 నుంచి 28 సచివాలయంలోని లబ్ధిదారులు, 31న జరిగేకార్యక్రమంలో 29 నుంచి 45, 73 సచివాలయ పరిధిలోని లబ్ధిదారులు హాజరుకావాలన్నారు. ఏప్రిల్ 1న రామ్ నగర్‌లోని రాయల్ పంక్షన్ హాలులో జరిగే కార్యక్రమంలో 46 నుంచి 58, 74వ సచివాలయ పరిధిలోని లబ్ధిదారులు, 2న తపోవనం వీవీఆర్ ఫంక్షన్ హాలులో జరిగే కార్యక్రమంలో 59 నుంచి 72వ సచివాలయ పరిధిలోని లబ్ధిదారులు హాజరుకావాలన్నారు.

5న 'చలో ఢిల్లీ '

అనంతపురం రూరల్: కేంద్ర ప్రభుత్వానికి ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు తెలిపారు. సోమవారం ఐఎంఎల్ డిపో దగ్గర చలో ఢిల్లీ కార్యక్రమ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రూరల్ మండల కార్యదర్శి మోహన్‌రెడ్డి , ఐఎంఎల్ డిపో కార్మికులు నాగార్జున, పుష్పరాజ్, మారుతి, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'పోలవరం' ఎత్తు తగ్గించొద్దు

అనంతపురం అర్బన్: పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించకూడదని సీపీఐ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట రెండు రోజుల రిలే దీక్షలు చేపట్టారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీశ్, జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడారు. రాయలసీమకు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించే దిశగా చర్యలు సాగుతున్నట్లు తెలుస్తోందన్నారు. మొదటి డిజైన్ ప్రకారం ఎత్తు 45.72 మీటర్లు, 196.60 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించాలన్నారు. పోలవరం నిర్మాణ విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ప్రాజెక్టు పూర్తికి కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మహిళ సమాఖ్య కార్యదర్శి పద్మావతి, నాయకులు లింగమయ్య, కేశవరెడ్డి, రాజేశ్‌గౌడ్, అల్లీపీరా, రమణయ్య, పార్వతీప్రసాద్, నరేశ్, సంతోష్, కుళ్లాయిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

శింగనమల: చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యకరంగా ఉంటారని ఎంపీడీఓ నిర్మలాకుమారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మూడో నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ , సీడీపీఓ ఉమాశంకరమ్మ, సూపర్‌వైజర్ హేమజ్యోతి, అంగన్‌వాడీ వర్కర్ భారతి తదితరులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరాలయం శతాబ్ది ఉత్సవాలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనంత, శివాలయం సభ్యులు

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయ శతాబ్ది ఉత్సవాలు వచ్చేనెల ఘనంగా జరుగనున్నాయి. సోమవారం రాత్రి ఆలయ అనువంశీకులు హోసూరు రామసుబ్రమణ్యం, ఆలయ మాజీ చైర్మన్ సోమర జయచంద్ర నాయుడు, కమిటీ సభ్యులు వెంకటస్వామి, చంద్ర, సురేష్, ప్రధాన అర్చకులు నరసింహశాస్త్రి తదితరులు పోస్టర్ల ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన కాశీ విశ్వేశ్వరాలయంలో ఏప్రిల్ 23 నుంచి 26 వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. రోజూ యజ్ఞాలు, యాగాలతో పాటు పలువురు పీఠాధిపతులు విశిష్ట అతిథులుగా హాజరై అనుగ్రహభాషణం చేస్తారన్నారు. అనంతరం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఇంటికి వెళ్లి ఉత్సవాలు బ్రోచర్లను అందించి, ఆహ్వానించారు.

కోర్ బ్రాంచ్‌లతోనే ఉజ్వల భవిష్యత్


సావనీర్ ఆవిష్కరిస్తున్న ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ మల్లికార్జున రెడ్డి

అనంతపురం: కోర్ బ్రాంచులైన సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ మల్లికార్జున రెడ్డి అన్నారు. సోమవారం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజినీర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోర్ బ్రాంచుల్లో తొలుత జీతాలు తక్కువైనా భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఎలక్ట్రికల్ విభాగం ప్రొఫెసర్ ఆర్.కిరణ్మయి విశిష్ట అతిథిగా హాజరై మాట్లాడారు. డీఆర్‌డీఏ, ఇస్రో తదితర ప్రతిష్టాత్మక సంస్థల్లో ఎలక్ట్రికల్ విద్యార్థులకు అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్. నాగభూషణ రాజు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం పక్కదారి


అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న మెడికల్ ఆఫీసర్ నారాయణస్వామి

అనంతపురం సెంట్రల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పక్కదారి పట్టింది. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు లేకపోయినా పౌష్టికాహారం రికార్డుల్లో నమోదు చేశారు. జవహార్ బాల సురక్ష యోజన కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ మెడికల్ ఆఫీసర్ నారాయణస్వామి తనిఖీ చేయగా, అవకతవకలు బట్టబయలయ్యాయి. సోమవారం మెడికల్ ఆఫీసర్ నారాయణస్వామి శారదనగర్, ఎస్‌బీఐ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సదరు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు కానీ, బాలింతలు, గర్భిణులు హాజరుకాలేదు. కనీసం భోజనం కూడా వండలేదన్న విషయాన్ని గుర్తించారు. ఎన్ని రోజుల నుంచి ఇలా చేస్తున్నారని ప్రశ్నించారు. అంగన్‌వాడీ సిబ్బంది మాత్రం పొంతనలేని సమాధానాలు చెప్పారు. పౌష్టికాహారం పక్కదారి పట్టిస్తున్నారని సీడీపీఓ లలితమ్మకు ఫిర్యాదు చేసినట్లు మెడికల్ ఆఫీసర్ నారాయణస్వామి తెలిపారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి


విద్యార్థికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: విద్యార్థులు బాగా చదివి, తల్లిదండ్రులకు గౌరవం తెచ్చేలా ఉన్నత శిఖరాలకు చేరాలని మేయర్ వసీం విద్యార్థులకు సూచించారు. సోమవారం అనంతపురం నగరం కోవూర్‌నగర్‌లోని విశ్వభారతి పాఠశాల వార్షికోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మేయర్ మాట్లాడుతూ చదువుతోనే ఆర్థికాభివృద్ధి సాధించొచ్చన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం గతేడాది పదో తరగతి పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అనసూయదేవి, హెచ్‌ఎం ఆయేషా, కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, నాయకులు ఖాజా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తించాలి

అనంతపురం టవర్‌క్లాక్: దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తించాలని అంబేడ్కర్ ఇండియా మిషన్ జిల్లా కన్వీనర్ శామ్యుల్ ముఖర్జీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అసెంబ్లీ సమావేశంలో తీర్మానం చేసి, కేంద్ర ప్రభుత్వానికి బిల్లు పంపడం హర్షణీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ బిల్లును ఆమోదించి, న్యాయం చేయాలని కోరారు.

దళిత క్రిస్టియన్లను ఎస్సీల్లో చేర్చకూడదు

అనంతపురం అర్బన్: దళిత క్రిస్టియన్లను ఎస్సీల్లో చేర్చాలనే తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించాలని బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలియజేశారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సాకే శివశంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ దళితులు క్రిస్టియన్లుగా మతం మార్చుకున్నప్పుడు వారు బీసీ కేటగిరికి వస్తారన్నారు. అయితే దళిత క్రిస్టియన్లను ఎస్సీల్లో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేయడం సరైన చర్య కాదన్నారు. అనంతరం జేసీ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం సమర్పించారు.

పశుశాఖ డీడీ అచ్చెన్న మృతి బాధాకరం


నివాళి అర్పిస్తున్న పశు సంవర్ధకశాఖ జేడీ సుబ్రమణ్యం

అనంతపురం అగ్రికల్చర్: వైఎస్సార్ కడప జిల్లా బహుళార్థ పశువైద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సి.అచ్చన్న మృతి బాధాకరమని జిల్లా జాయింట్ డైరెక్టర్ వై.సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం పశుసంవర్ధకశాఖ జేడీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పశుశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్య సిబ్బందిని నియమించండి

కనగానపల్లి: మండలంలో పశువైద్యాధికారులను నియమించాలని రైతు సంఘం మండల నాయకులు అధికారులను కోరారు. దీనిపై సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో పాడి రైతులతో కలిసి రైతు సంఘం నాయకులు గోవిందు, బాలరాజు తహసీల్దార్ పీవీ రమణకు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో రెగ్యులర్ పశు వైద్యాధికారిని నియమించాలని వారు అధికారులను కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నాగరాజు, వెంకటేసులు, మహానంది, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 25 మంది ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సి.జయచంద్రారెడ్డి

అనంతపురం: అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 25 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ సి. జయచంద్రా రెడ్డి తెలిపారు. ఫస్ట్ సోలార్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో మొత్తం 34 మంది విద్యార్థినులు హాజరుకాగా, 25 మందికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఏడాదికి రూ.2.20 లక్షల ప్యాకేజీ నిర్ణయిస్తూ నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రాంగణ నియామకాల అధికారి కే మల్లికార్జున రావు, సి.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'జగనన్న జయకేతనం'


నవరత్నాల ప్రాధాన్యతను తెలియజేస్తున్న కళాకారులు

అనంతపురం కల్చరల్: సోములదొడ్డిలో ప్రపంచ నాటకరంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి నిర్వహించిన 'జగనన్న జయకేతనం' నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. శ్రీసాయిబాబా నాటక కళా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పదిరోజుల పాటు పలు మండలాల్లో నాటక ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు మైఖేల్‌బాబు తొలిరోజు ప్రారంభించారు. సందర్భంగా నటీనటులు వెంకటేష్, భీమలింగ, వంశీ, అర్చన తదితరులు రాగయుక్తంగా పద్యాలతో, సంభాషణలతో నటించి మెప్పించారు. అనంతరం కళాకారులకు ప్రపంచ నాటక రంగ దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేశారు.

పీటీసీలో ఉచిత వైద్య శిబిరం


పోలీసులకు వైద్యపరీక్షలు చేస్తున్న దృశ్యం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పోలీసు శిక్షణా కళాశాల (పీటీసీ) ఆవరణలో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ గీతాదేవి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించినట్లు వారు తెలిపారు. స్థానిక కిమ్స్ సవీర ఆస్పత్రి వారి సౌజన్యంతో గుండెకు సంబంధించిన ఈసీజీ, 2 డీ ఎకో, తదితర పరీక్షలు చేశారన్నారు. సిబ్బంది నుంచి డీఎస్పీ స్థాయి వరకు ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు జె.మల్లికార్జునవర్మ, అల్లాబకాష్, టి.శ్రీనివాసులు, దేవదాసు, పీటీసీ డాక్టర్ ఆదిశేషు, పలువురు సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

1న మెగా కంటి వైద్య శిబిరం

అనంతపురం సెంట్రల్: నగర శివారులోనిని చలమారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఏప్రిల్ 1న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ద్వారకా చలమారెడ్డి ట్రస్టు నిర్వాహకులు ద్వారక హరినాథ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

రేపటి నుంచి పండమేటిరాయుడి ఉత్సవాలు


లక్ష్మీవెంకటేశ్వరస్వామి మూలవిరాట్

రాప్తాడు: రాప్తాడు ప్రజల ఆరాధ్య దైవం లక్ష్మీ వెంకటేశ్వరస్వామి (పండమేటి రాయుడు) బ్రహ్మోత్సవాలు ఈనెల 29, 30 తేదీల్లో జరగనున్నాయి. స్వామికి రాప్తాడుతో పాటు అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు, కర్ణాటక, బెంగళూరు తదితర ప్రాంతాల్లో స్వామికాపులు ఉన్నారు. భక్తి శ్రద్ధలతో దేవ దేవుడిని ప్రార్థిస్తే కోరిన కోరికలు తీరి, సుఖసంతోషాలతో ఉంటారని భక్తుల విశ్వాసం. పూర్వం వెంకటేశ్వర స్వామి ఆలయంతోపాటు సమీపంలోనే కోనేరు నిర్మించారు. అప్పట్లో ఏటా ఉత్సవాలు జరిగేవి. ఆలయం ఎదురుగా ఉన్న పండమేరు వంక సమీపంలో పరుష, ఎద్దుల పరుష, సంతలు జరిగేవి. ఆలయం దగ్గర నిర్వహించే పరుషకు రాప్తాడు, ప్రసన్నాయపల్లి, చుట్టుపక్కల గ్రామాల ప్రజలేకాకుండా మండలంలోని ఇతర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామికి మొక్కులు తీర్చుకునే వారు.

బ్రహ్మోత్సవాలు ఇలా...

ఈ నెల 29, 30న శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీ లక్ష్మీ పండమేటి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు లక్ష్మీ పండమేటి వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి గ్రామంలో బండ్లపల్లి భజన బృందంతో కోలటాలతో రాముడు, సీత విగ్రహాలతో పాటు పండమేటి వెంటేశ్వర స్వామిని భక్తి శ్రద్ధలతో ఊరేగిస్తారు. రాత్రి 9 గంటలకు భజనలు ప్రారంభిస్తారు. 30న ఉదయం శ్రీ కృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన కోనేటిలో చక్రస్నానం, అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆలయంలో సీతారాముల కల్యాణం, అనంతరం ఉదయం 9 గంటల నుంచి 3 గంటల వరకు రాతి దూలం లాగుడు పోటీలు, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు బండ్లపల్లి గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు ఆలయం దగ్గర ఉట్ల పరుష నిర్వహిస్తారని ఆలయ కమిటీ చైర్మన్ గంజి రాముడు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఆలయ కమిటీ చైర్మన్ గంజిరాముడు మాట్లాడుతూ లక్ష్మీ పండమేటి వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సహకారంతో ఆలయ పునర్నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. త్వరలోనే ఆలయ పనులు ప్రారంభిస్తామన్నారు.